సాక్షి
చిత్తూరు
సోమవారం । 17 । మార్చి । 2025



**ట్రాన్స్‌'ఫార్మర్'కష్టాలు**
కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయడంలో జాప్యం నెలకొంటోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



**జల్లికట్టు జోరు.. జనహోరు**
వెదురుకుప్పం మండలంలోని కొమరగుంటలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. కొడెగిత్తలను పట్టుకునేందుకు పోటీపడ్డారు. - 8లో

**రంజాన్ వేళలు**

| | ఇఫ్తార్ సోమవారం (సా) | సహర్ మంగళవారం (ఉ) |
|---|---|---|
| చిత్తూరు | 6-29 | 4-59 |
| పుంగనూరు | 6-30 | 5-04 |

## న్యూస్‌రీల్

### వరసిద్ధుని సేవలో రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్



స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కృష్ణతేజ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి స్వామి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ పెంచల కిషోర్ శేష వస్త్రంతో సన్మానించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, ఏఈఓ రవీంద్రబాబు, డీపీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### టీకాలలో రొంపిచెర్ల మొదటి స్థానం

రొంపిచెర్ల : గాలి కుంటు వ్యాధి టీకాలు వేయడంలో రొంపిచెర్ల మండలం చిత్తూరు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. మండలంలో 7,854 పశువులకుగాను 5,701 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు, 520 దూడలకుగాను 367 దూడలకు బ్లూ సోసిస్ వ్యాధి టీకాలు, 5000 గొర్రెలు, మేకలకు మశూచి వ్యాధి నిరోధక టీకాలు వేయడంలో చిత్తూరులో రొంపిచెర్ల మండలం మొదటి స్థానంలో నిలిచింది. అలాగే 121 పశువులకు బీమా చేసి మొదటి స్థానంలో ఉన్నట్లు మండల పశు వైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. మండలానికి పశు బీమా కోసం రూ.20 వేలు బడ్జెట్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే పశు బీమా కోసం రూ.1,85,856 లక్షల వరకు ఖర్చు చేశామని తెలిపారు. దీంతో మండలానికి అదనంగా రూ.1,65,856 లక్షలు మళ్లీ మంజూరు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో 98.2 శాతం బడ్జెట్‌ను ఖర్చు చేసి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలవడం జరిగిందన్నారు.

### గ్రేడ్-3 ఏఎన్‌ఎం పదోన్నతుల్లో గోల్‌మాల్ ?

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఉమ్మడి జిల్లాలో గ్రేడ్ -3 ఏఎన్‌ఎంల పదోన్నతుల్లో గోల్‌మాల్ చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల పాటు జీఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎన్‌ఎంలు ఇందుకు అర్హులు. అయితే గత 6 నెలలుగా ఈ పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో పదోన్నతుల కోసం కొంత మంది అడ్డదారులు తొక్కినట్లు విమర్శలు వస్తున్నాయి. కుల ధ్రువీకరణ పత్రం తప్పుగా ఇచ్చినట్లు తెలిసింది. సిఫార్సులు, కాసులకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శలు వస్తున్నాయి. రోస్టర్ పాయింట్లు మొత్తం గోల్ మాల్ జరిగిందని కొంత మంది ఏఎన్‌ఎంలు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నారు.

### రెండు కిలోల గంజాయి స్వాధీనం

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో ఓ ముఠా నుంచి రెండు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఇరువారం శివారులో గంజాయి విక్రయిస్తున్నట్లు టూటౌన్ సీఐ నెట్టికంటయ్యకు సమాచారం అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అల్లాబతో పాటు మరికొందరు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ దాడుల్లో రెండు కిలోలకు పైగా గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఓ ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

# వరిసిరి



సాగులో ఉన్న చిట్టిముత్యాలు వరి



శివన్ సంబా పైరును పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

అందరి రైతుల్లా ఆలోచించలేదు.. విభిన్నంగా ఆలోచించాడు.. ఏటా నష్టపోయే రైతులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలనుకున్నాడు.. నష్టాల బాట నుంచి లాభాల సాగులోకి తీసుకురావాలని సంకల్పించాడు.. ప్రతికూల పరిస్థితులను..అనుకూలంగా మార్చుకున్నాడు..మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను..ప్రకృతి పద్ధతుల్లో రసాయనాలు లేకుండా పండించాలనే సంకల్పంతో డిమాండ్ ఉన్న చిట్టిముత్యాలు, బిర్యానీ బియ్యం, పలావు వంటి వరి రకాలను సాగు చేశాడు.. ఈ నేలలు ఆ వరి రకాలకు అనుకూలం కాదనే వారికి లాభాల రుచి చూపించి , ఔరా అనిపించాడు.. మిగిలిన అన్నదాతలకు నగరిలోని ఆదర్శ రైతు సుబ్బరాజు మార్గదర్శిగా నిలిచారు.

- డిమాండు పంటలే సాగు.. లాభాలే బాగు
- నగరిలో శివన్ సంబా, చిట్టిముత్యాలు రకాల వరి సాగు
- కిలో రూ.100 నుంచి రూ.125 వరకు ధరలు
- రైతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న సుబ్బరాజు



శివన్ సంబా వరి రకం పంట వద్ద రైతు సుబ్బరాజు, శివన్‌సంబా నారు, కంకి దశలో శివన్‌సంబా వరి

నగరి : వాతావరణ ప్రతికూల పరిస్థితులు..ఎరువులు, విత్తనాల ధరలు పెరగడంలో పెరిగిన పెట్టుబడులు.. చీడపీడలు..కష్ట నష్టాలు భరించలేక... వ్యవసాయమే వద్దు బాబోయ్ అనే రోజుల్లో వ్యవసాయం అంటే దండగ కాదు రైతు తలచుకుంటే పండగలా మార్చుకోవచ్చని రైతు సుబ్బరాజు నిరూపిస్తున్నారు. నగరి మండలం గుండ్రాజుకుప్పానికి చెందిన రైతు సుబ్బరాజుకు వ్యవసాయం అంటే మక్కువ, అయితే అందరి రైతుల్లా సాగు చేస్తాం లాభాల సంగతి భగవంతుడు చూసుకుంటాడు అని వదిలేయలేదు. డిమాండు ఉండే పంటలు మన భూముల్లో ఎందుకు సాగు చేయలేం ప్రయత్నిద్దాం ఫలితం దక్కుతుందంటూ తన కష్టాన్ని నమ్ముకున్నాడు. జిల్లాలోని రైతులు ఎన్‌ఎల్‌ఆర్-34449, ఏడీటీ-37, బీపీటీ-5204, ఆర్‌ఎన్‌ఆర్-15048 రకాలనే సాగు చేస్తారు. అందరూ సాగుచేసే పంటలే సాగు చేయాలనే మూస పద్ధతికి స్వస్తి పలికి కొత్త వంగడాలు సాగు చేసేందుకు సన్నద్ధమయ్యాడు. సంప్రదాయ పద్ధతుల్లో ఏ పంటనైన పండించవచ్చని తాను సాగు చేసే పంటల ద్వారా సుబ్బరాజు నిరూపిస్తున్నారు.

#### పండించి చూపించారు..

తమిళనాడులో సారవంతమైన భూముల్లో మాత్రమే సాగవుతూ, ఇనుము, జింక్ శాతం ఎక్కువగా కలిగి ఎముకల, కండరాల అభివృద్ధికి తోడ్పడే బియ్యంగా పేరుగాంచి డిమాండ్ ఎక్కువగా ఉన్న 'శివన్ సంబా' రకం వరిని అలాగే తమిళనాడులో సీరగసంబాగాను, ఇక్కడ చిట్టిముత్యాలు, చిన్నబియ్యం, పాయసం బియ్యం అని పిలుచుకునే కార్బోహైడ్రేడ్‌లు ఎక్కువగా ఉన్న వరిని కూడా తన భూముల్లో సాగుచేసి అందరి చేత సుబ్బరాజు శభాష్ అనిపించుకున్నారు. అలాంటి రకాలు ఇక్కడ పండవు అనేవారు ఆశ్చర్యపోయేలా పంటను పండించారు.

#### దళారులను నమ్ముకోలేదు

తాను పండించిన పంటను మార్కెట్‌కు తరలించే విధానంలో ఆయన దళారులను నమ్ముకోలేదు. పండించిన వరి పంటను తానే బియ్యంగా చేసి నిల్వ ఉంచి అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. మూస పద్ధతిలో సాగు చేసే ఎన్‌ఎల్‌ఆర్-34449, ఏడీటీ-37, బీపీటీ-5204, ఆర్‌ఎన్‌ఆర్-15048 రకాలు కిలో రూ.50 నుంచి రూ.60కి విక్రయిస్తుంటే సన్నగా ఉంటూ బిర్యానీలు, పులావ్ లాంటి వంటలలో ఉపయోగించే బియ్యాలైన శివన్ సంబా రకం బియ్యం కిలో రూ.100, చిట్టిముత్యాలు బియ్యం కిలో రూ.125 పలుకుతూ లాభాలను చూపుతోంది. ఇలా వ్యవసాయంలో నూతన మార్గాన్ని మిగిలిన రైతులకు చూపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


#### రసాయనాలు వాడకుండా..

పంటలకు ఎలాంటి రసాయనాలు వాడకుండా జీవామృతాలు, కషాయాలు లాంటివి వాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో భూసారం పెంచుకుంటూ వరి రకాలను సాగు చేస్తున్నారు. కొత్త రకం వంగడాలు పండిస్తూ వాటి ద్వారా లాభాలు గడిస్తున్నారు. మార్కెట్‌ను అర్థం చేసుకున్న ఆయన బియ్యాన్ని నిల్వ ఉంచి పాత బియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో దళారులు లేకుండా స్వయంగా తానే సామాజిక మాధ్యమాల ద్వారా మార్కెటింగ్ చేస్తూ అవసరమైన వారికి బస్తాల లెక్కన శివన్ సంబా, చిట్టిముత్యాలు రకం బియ్యాన్ని విక్రయిస్తున్నారు.



ద్రవజీవామృతం సిద్ధం చేసుకుంటున్న రైతు

#### మూస పద్ధతికి స్వస్తి పలకాలని..



వ్యవసాయంలో మార్పు తీసుకొచ్చి కొత్త పంటలు సాగు చేయాలనే ఆలోచనతోనే కొత్త వంగడాలు సాగు చేస్తున్నా. గతంలో అందరూ పండించే రకాలే పండిచేవాన్ని. దీంతో డిమాండ్ ఉండేదికాదు. పక్కరైతులు ఏ ధరకు అమ్ముతారో ఆ ధరకే విక్రయించాల్సి వచ్చేది. దీంతో దేశవాళి వంగడాల్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం మొదలుపెట్టా. ఇతర ప్రాంతాల నుంచి విత్తనాలు తెచ్చుకొని సాగు చేస్తున్నా. పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులనే అవలంబించా. ఈ పంటలను సాగు చేయడానికి ముందుకొచ్చే రైతులకు విత్తనాలను సరఫరా చేస్తా.

– సుబ్బరాజు, రైతు, గుండ్రాజుకుప్పం గ్రామం

#### కొత్త వంగడాలతో లాభాలు



జిల్లాలో ప్రస్తుతం సాగు చేస్తున్న వరి రకాలతో పోల్చుకుంటే శివన్‌సంబా, చిట్టిముత్యాలు రకాలు నెల రోజులు ఎక్కువ సమయం తీసుకుంటుంది. దిగుబడి సాధారణ బియ్యం రకాలతో పోల్చుకుంటే కొంత తక్కువగానే ఉంటుంది. అయితే ఈ బియ్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కొన్ని కంపెనీలు ఈ బియ్యాన్ని కిలో ప్యాకెట్లు చేసి రూ.170 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నాయి. అందరూ ఒకే తరహా బియ్యం పండిస్తే డిమాండ్ అంతగా ఉండదు. ఇలా కొత్త వంగడాలు పండించగలిగితే లాభాలు చూడవచ్చు.

– రాఘవేంద్ర యాదవ్, వ్యవసాయాధికారి, నగరి

## ఈరోజు

### నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఇంచార్జి కలెక్టర్ విద్యాధరి వెల్లడించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. గైర్హాజరయ్యే వారిపై చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

### పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

### 'సంకటహర' వ్రతం

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం సంకటహర గణపతి వ్రతం జరగనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆస్థాన మండపంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్రతం జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు ఈ వ్రతంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.

### పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పించిన అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు సేవలు ఎనలేనివని జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీభాషా అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగుజాతి కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు ఎన్నటికీ మరువలేమన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఏబీసీడబ్ల్యూవోలు వాసంతి, కోటేశ్వర రావు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం



మూల్యాంకనానికి ఎంపిక చేసిన పీసీఆర్ కళాశాల

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్ పరీక్షలు ఈనెల 15వ తేదీతో ముగిశాయి. ఈక్రమంలో మూల్యాంకన ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎంపిక చేశారు. ఈ ఏర్పాట్లను డీవీఈఓ సయ్యద్ మౌలా పర్యవేక్షించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 1,33 లక్షల ఇంటర్మీడియట్ జవాబు పత్రాలు జిల్లాకు చేరాయి. వీటిని పీసీఆర్ ప్రభుత్వ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. జిల్లా వ్యాప్తంగా వివిధ జూనియర్ కళాశాలల్లో అనుభవం ఉన్న 510 మంది అధ్యాపకులను మూల్యాంకన విధులకు నియమించారు. ఈనెల 31వ తేదీ లోపు మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు.

#### సెల్‌ఫోన్‌లు వినియోగించొద్దు



పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మూల్యాంకన ప్రక్రియ నిర్వహించనున్నాం. ఇందుకు అవసరమైన అన్ని కేడర్‌లలో సిబ్బందిని నియమించాం. విధుల్లో ఉన్న సిబ్బంది సెల్‌ఫోన్‌లు వినియోగించడానికి వీల్లేదు.

– సయ్యద్ మౌలా, జిల్లా ఇంటర్మీడియట్ డీవీఈఓ

### శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 82,580 మంది స్వామివారిని దర్శించుకోగా 31,905 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.0 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### ట్రేడ్ లైసెన్స్ బకాయిల పేరిట నకిలీ కాల్స్

చిత్తూరు అర్బన్ : మీ దుకాణానికి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ బకాయి పెండింగ్‌లో ఉంది. ఈ నంబర్‌కు ఆన్‌లైన్ పే మెంట్ చేయాలంటూ మున్సిపల్ అధికారుల పేరుతో కొంత మంది మోసాలకు పాల్పడుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు పోలీసులను ఆశ్రయించారు. నగరంలోని దుకాణాల్లో ఏ వ్యాపారం చేసినా ట్రేడ్ లైసెన్సును మున్సిపల్ అధికారుల నుంచి పొందాల్సి ఉంటుంది. అయితే ఇటీవల ట్రేడ్ లైసెన్సు ఫీజులు బకాయి ఉన్నట్లు పలువురికి ఫోన్లు వచ్చాయి. బకాయిలను 90803 29172, 76709 06441 నంబర్‌లకు యూపీఐ ద్వారా చెల్లించాలని ఒత్తిళ్లు చేశారు. పలువురు వ్యాపారులు నగదును ఈ నంబర్లకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. విషయం కమిషనర్ నరసింహ ప్రసాద్ దృష్టికి వెళ్లడంతో.. అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిలను వార్డు సచివాలయాలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల వద్ద , నగరపాలకలోని పుర సేవా కేంద్రంలో తగిన రసీదులతో చెల్లించవచ్చన్నారు. మోసపూరిత ఫోన్ కాల్స్ పై వ్యాపారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ కోరారు.

## విజయీభవ !

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- అరగంట ముందే పరీక్ష కేంద్రంలోకి..
- కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి
- ఉచితంగా ఆర్టీసీ ప్రయాణం

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ఏప్రిల్ 1 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానున్నాయి. జిల్లా పరిధిలో 21,248 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. విద్యార్థులకు హాల్‌టికెట్ తప్పనిసరి. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేదనే కారణంతో హాల్ టికెట్‌లు ఇవ్వకపోతే ప్రభుత్వ వాట్సాప్ నంబర్ 95523 00009కు విద్యార్థి వివరాలు పంపి హాల్ టికెట్‌ను డౌన్ లోడ్ చేసుకునేలా అవకాశం కల్పించారు. పరీక్ష సమయానికి అరగంట ముందు విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించనున్నారు. అయితే కొన్ని అత్యవసర పరిస్థితుల్లో ఉదయం 10 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. ఆ తర్వాత వస్తే అనుమతి ఉండదని అధికారులు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రాథమిక చికిత్సకు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.



తవణంపల్లి జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో బోర్డుపై నంబర్‌లు వేస్తున్న అధికారులు

| జిల్లా పదో తరగతి పరీక్షల సమాచారం | |
|---|---|
| పరీక్ష కేంద్రాలు | 118 |
| హాజరవుతున్న బాలురు | 11,005 |
| హాజరవుతున్న బాలికలు | 10,243 |
| సమస్యలకు కంట్రోల్ రూం నంబర్ 90321 85001 | |

#### హాల్ టికెట్‌తో ఉచిత ప్రయాణం

విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైన బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. హాల్ టికెట్ చూపించి ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చు.

#### ఒత్తిడికి గురి కావొద్దు



విద్యార్థులు పరీక్షలను ప్రశాంతంగా రాసే వాతావరణం కల్పించాం. చూచిరాతలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం. పరీక్ష కేంద్రం బాధ్యులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

– విద్యాధరి, ఇంచార్జి కలెక్టర్, చిత్తూరు

## పేట్రేగుతున్న 'పచ్చ' మాఫియా!

- ఇసుక, గ్రావెల్‌ను అడ్డదిడ్డంగా తోడేస్తున్న వైనం
- సరిహద్దు రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలింపు
- రూ. లక్షలు స్వాహా చేస్తున్న కూటమి నేతలు

కార్వేటినగరం : సమయం లేదు మిత్రమా.. అందిన కాడికి దోచేద్దాం .. ఎవరైనా అడ్డొస్తే అంతు చూస్తాం. మాట వినకపోతే ఏ అధికారినైనా వదిలి పెట్టే ప్రసక్తే లేదు. అక్రమాలను అడ్డుకుంటున్న అధికారులపై కూటమి నాయకుల బెదిరింపులు, దాడులతో హడలిపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో చోటా నాయకుల నుంచి ప్రజా ప్రతినిధుల వరకూ అక్రమాలు, దందాలు, దోపిడీలు రోజురోజుకూ పేట్రేగిపోతున్నాయి. చిత్తూరు జిల్లాలో కూటమి నాయకులు చేస్తున్న దందాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. కొంత మంది ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఇసుక, మట్టిని విచ్చల విడిగా తోడేస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల అండదండలతో రూ. కోట్లు ఆర్జిస్తున్నారు. పట్టపగలే యథేచ్ఛగా గ్రావెల్‌తో పాటు ఇసుకను తోడి రవాణా చేస్తున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో ఒక పక్క ఇసుక మరోపక్క గ్రావెల్‌ను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి రూ.కోట్లు దండుకుంటున్నారు.

#### అక్రమార్కుల అడ్డాగా జీడీ నెల్లూరు

గంగాధర నెల్లూరులోని ఆరు మండలాల్లోనూ కూటమి నేతలు మట్టి, ఇసుక దోపిడీ చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. తమిళనాడుకు సరిహద్దు ప్రాంతమైన గంగాధర నెల్లూరు పచ్చ మాఫియాకు అడ్డాగా మారింది. ప్రధానంగా పాలసముద్రం, గంగాధర నెల్లూరు, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం మండలాల్లో నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తరలిస్తున్నారు.



గంగాధర నెల్లూరు : నీవా నదిలో జేసీబీ ద్వారా ఇసుకను లోడింగ్‌నకు వరుస కట్టిన ట్రాక్టర్‌లు

#### ఇసుక దోపిడీ ఇలా..

- గంగాధర నెల్లూరు మండలంలోని ముక్కలత్తూరులో నీవానది నుంచి చెన్నైకి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇక్కడ ఇసుకను డంప్ చేసి రాత్రికి రాత్రే తమిళనాడుకు తరలించి దోచేస్తున్నారు.
- పాలసముద్రం మండలం నుంచి నిత్యం వందల టన్నుల్లో ఇసుక తరలిస్తున్నారు. గంగాధర నెల్లూరు మండలంలోని నీవా నది నుంచి పాలసముద్రం మండలంలోని వనదుర్గాపురం, సింహరాజపురం, బలిజకండ్రిగ, మటవలం గ్రామాల్లో డంప్ చేసి రాత్రికి రాత్రే టిప్పర్లలో కూటమి నేతలు ఇసుకను తరలిస్తున్నారు. ఒక టిప్పర్ ఇసుక రూ.25 వేలు ధర పలుకుతోంది. 16 చక్రాలు గల టిప్పర్లలో రెండు రోజుల కొకసారి ఇసుకను తరలిస్తూ దోపిడీ చేస్తున్నారు.
- పచ్చికాపల్లం, వెదురుకుప్పం ప్రాంతాల నుంచి మట్టి దోపిడీ జరుగుతోంది. ఇటీవల బ్రాహ్మణపల్లె సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వాహనాలను అడ్డుకోబోయిన వీఆర్‌ఏపై అధికార పార్టీకి చెందిన వ్యక్తి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఆ వ్యక్తిపై కేసు నమోదుకు సిఫార్సు చేసినా ఓ ఎమ్మెల్యే అడ్డుతగిలి కేసు నమోదు చేయకుండా కాపాడినట్లు విమర్శలు వస్తున్నాయి.
- శ్రీరంగరాజపురంలో కూటమి నేతలు విచ్చలవిడిగా మట్టి దందా చేస్తున్నారు. గ్రావెల్ కోసం గుట్టలను మాయం చేస్తున్నారు.
- కార్వేటినగరం మండలంలో గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేదు. ఓ ఎమ్మెల్యే మండలం కావడంతో ఇసుకను డంప్ చేసుకుని రవాణా చేస్తున్నారు. ఇక్కడ నుంచి పళ్లిపట్టు మీదుగా చెన్నైకి తరలివెళుతోంది.

#### క్వారీల్లో దందాలు

క్వారీ యజమానుల వద్ద నుంచి స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పి వసూళ్లకు తెగబడుతున్నారు. ఆరు మండలాల్లోనూ పీఏలను నియమించిన ఆయన వివరాలను సేకరించి దందాలకు పాల్పడుతున్నారు. నేను ఎమ్మెల్యే పీఏని మామూళ్లు ఇస్తావా సీజ్ చేయమంటావా అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## క్లుప్తంగా

### బైక్ అదుపుతప్పి టీచర్ మృతి


మృతిచెందిన టీచర్ వెంకటరమణ

చౌడేపల్లె : మండలంలోని చౌడేపల్లె - మదనపల్లె రోడ్డులోని బోయకొండ సమీపంలోని పక్షిరాజపురం వద్ద ఆదివారం బైక్ బోల్తాపడి ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఎస్‌ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. మదనపల్లె పట్టణం ఎస్వీఆర్ లేఅవుట్‌లో నివాసముంటున్న ఎం.వెంకటరమణ(55) చౌడేపల్లెలో బంధువుల గృహ ప్రవేశానికి వచ్చాడు. తిరిగి వెళ్తుండగా పక్షిరాజపురం వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### వేర్వేరు ప్రమాదాల్లో ఒకరి మృతి
– ఇద్దరికి తీవ్రగాయాలు


ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు


మృతి చెందిన జయప్ప

కుప్పం : నియోజకవర్గంలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలోని సామగుట్టపల్లి వద్ద ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో జయప్ప (65) అక్కడికక్కడే మృతి చెందాడు. శాంతిపురం మండలం సొన్నేగానిపల్లి గ్రామానికి చెందిన జయప్ప కర్ణాటక రాష్ట్రం కామసముద్రంలో తన కూతురు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పలమనేరు నుంచి కుప్పానికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కుప్పం నుంచి మల్లానూరు ప్రధాన రోడ్డు మార్గంలో వానగుట్టపల్లి వద్ద ఓ కారు ద్విచక్ర వాహనదారుడిని ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుప్పం నుంచి స్వగ్రామానికి వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు సింగారవేలు, మురళీలను మల్లానూరు నుంచి కుప్పం వైపు వస్తున్న ఓ కారు ఢీకొంది. దీంతో సింగారవేలు, మురళీలకు తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురు కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాన్స్‌'ఫార్మర్'కష్టాలు

- కాలిపోతున్న వాటికి మరమ్మతులు కరువు
- 2 నెలలుగా ప్రారంభం కానీ ఓఆర్ఎం
- ముగియనున్న వారంటీ గడువు
- పేమేంట్ పెండింగ్‌తో ఆగిన ఇన్‌స్టాలేషన్


నూతన ఓఆర్‌ఎంకు కనెక్షన్ ఎప్పుడు ఇస్తారో..


మరమ్మతులు చేస్తున్న కార్మికులు

చిత్తూరు కార్పొరేషన్ : ఎండలు మండుతున్నాయి.. పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. దీంతో విద్యుత్ పరికరాల వినియోగం పెరిగింది. ఓవర్ లోడ్‌తో జిల్లాలో వ్యవసాయ, నివాస ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ బాగు చేయడానికి (రీజనరేషన్) తెచ్చిన నూతన ఓఆర్ఎం మిషన్ ప్రారంభానికి ముహూర్తం కుదరడం లేదు. పేరు ఘనం ఆచరణ శూన్యం అన్నట్లు మారింది అధికారుల తీరు. ట్రాన్స్‌కో అధికారుల చొరవ చూపి మిషన్‌ను ఇన్‌స్టాల్ చేయకపోతే వేసవిలో తిప్పలు తప్పవు. రెండు నెలలుగా టెక్నీషియన్ రాకపోవడంతో మిషన్ అలంకారప్రాయంగా చిత్తూరులోని ఎస్పీఎంలో ఉంది. వారంటీ గడువు దగ్గర పడింది. గత ప్రభుత్వం 90 శాతం నిధులు చెల్లించింది. ప్రస్తుతం పది శాతం నిధుల పెండింగ్‌తో ఇన్‌స్టాలేషన్ ఆగింది.

**2 నెలలుగా ప్రారంభం కానీ ఓఆర్ఎం**

డిస్కం (రాయలసీమ, నెల్లూరు జిల్లాలు) పరిధిలో మొట్టమొదట సారిగా చిత్తూరుకు ఎస్పీఎం (స్పెషల్ మెయింటెన్స్)కు ఓఆర్ఎం (ఆయిల్ రీజనరేషన్ మిషన్)ను కేటాయించారు. తొలుత వీటిని తిరుపతి జిల్లా రేణిగుంటకు మంజూరు చేసినా అక్కడ ఎస్పీఎం మరమ్మతు పనులు జరుగుతుండటంతో కొత్తగా ఏర్పడిన ట్రాన్స్‌కో చిత్తూరు జిల్లాకు వీటిని బదిలీ చేశారు. దాదాపు రూ.50 లక్షల వ్యయంతో డిస్కంలో మోడల్‌గా మొట్ట మొదటి ఓఆర్ఎంను జనవరిలో చిత్తూరు ఎస్పీఎంలో బిగించారు. జిల్లాలో చిత్తూరు, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో ఎస్పీఎం కేంద్రాలున్నాయి. వీటి చుట్టు పక్కల నియోజకవర్గాల నుంచి పాడైన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేసి పంపుతారు. చిత్తూరు కేంద్రంలో ఎక్కువగా కాలిపోయినవి వస్తుంటాయి. ఫిబ్రవరి నెలాఖరు వరకు జిల్లాలో రోజు దాదాపు 20 ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేసి పంపుతున్నారు. మార్చిలో వీటి సంఖ్య మరో పది పెరిగాయి. రానురాను ఈ సంఖ్య మరింత పెరగనుంది. ఇందులో ఎక్కువగా ఆయిల్ మార్పు చేయాల్సినవి వస్తాయి. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు దాదాపు 50–70 లీటర్ల ఆయిల్‌ను శుద్ధి చేసి వాడుతుంటారు.

ప్రస్తుతం చిత్తూరులో ఉన్న మిషన్ రోజు 200 లీటర్లను మాత్రమే శుద్ధి చేస్తుంది. అంతే పది ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తవడానికి దాదాపు 5 రోజులు సమయం పడుతుంది. ఎండతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు పెరుగుతుంటాయి. అప్పటికి నూతన ఓఆర్ఎం అందుబాటులోకి రాకపోతే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు రోజుల తరబడి రైతులు వేచి చూడాలి. కొత్త ఓఆర్ఎం రోజు 2 వేల లీటర్ల ఆయిల్‌ను శుద్ధి చేస్తుంది. జిల్లాలోని ఎస్పీఎంలకు ఇక్కడికి నుంచి ఆయిల్‌ను శుద్ధి చేసి పంపవచ్చు. అలా చేయాలంటే మిషన్‌ను మొదట టెక్నీషియన్లు ఇన్‌స్టాల్ (కనెక్షన్) ఇవ్వాలి.

**ముగియనున్న వారంటీ గడువు**

ఆగస్టు నాటికి ఓఆర్ఎం గడువు ముగియనున్నది. ఇంకా ఇన్‌స్టాల్ కూడా కాలేదు. వాటిని వినియోగించి మరమ్మతు సమస్యలు వస్తే అప్పుడు వారంటీతో ఉచితంగా సేవలు పొందవచ్చు. ఆగస్టు నెల ముగిస్తే సేవలకు పైకం చెల్లించాల్సి వస్తుంది. వాటికి ఆర్థికంగా అనుమతులు వచ్చే వరకు పడిగాపులు కాయాలి. గత ప్రభుత్వంలో 90 శాతం వరకు డబ్బులు చెల్లించాలి. ప్రస్తుతం పది శాతం పెండింగ్‌లో ఉన్న మొత్తంను చెల్లించాలి. ఏనుగంతా చెల్లించి తోక మాత్రం కట్టలేను అన్న చందంగా మారింది. ఆ డబ్బులు చెల్లించపోవడంతో టెక్నీషియన్లు ఇన్‌స్టాల్ చేయడానికి రావడం లేదని తెలుస్తోంది.

**ఇబ్బందులు లేకుండా చూస్తాం**

"టెక్నీషియన్లు బిజీగా ఉండటంతో బిగింపు ఆలస్యమవుతోంది. ఇప్పటికే పలుమార్లు వీటిపై ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ చర్చించారు. టెక్నికల్ టీమ్‌తో మాట్లాడుతున్నాం. పది రోజుల్లో వాటిని బిగించి పనులు ప్రారంభించాలని చూస్తున్నాం. వేసవిలో ట్రాన్స్‌ఫార్మర్లు రిపేరుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
– వాసుదేవరెడ్డి, ఈఈ ఎంఆర్‌టీ విభాగం

### ఆగని 'కరి' దాడులు

- పంట పొలాలపై స్వైర విహారం
- ఆందోళనలో అన్నదాతలు
- అధికారులకు తలనొప్పిగా వ్యవహారం

యాదమరి : యాదమరి మండలంలో కరి దాడులు కొనసాగుతున్నాయి. రైతులకు ఏనుగుల బెడద తప్పడం లేదు. ఏనుగులను నియంత్రించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా విఫలమవుతూనే ఉన్నాయి. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. భూమిరెడ్డిపల్లి నుంజర్ల ప్రాజెక్టు వద్ద తగినంత నీటి వనరులతో పాటూ ఏనుగులకు అవసరమైన వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ ప్రాంతంలో మకాం వేస్తున్నాయి. పగలంతా నుంజర్ల ప్రాజెక్టు వద్ద సేద తీరడం ...రాత్రయితే సమీప గ్రామాల్లోని పంటలను ధ్వంసం చేయడం అలవాటుగా మారింది. తాజాగా ఆదివారం మండలములోని పత్రపల్లి గ్రామములోని రైతు పట్టాభికి చెందిన పంటలను ధ్వంసం చేశాయి.

దీంతో ఎప్పుడు ఎవరి మీద దాడి చేస్తుందో, ఎవరి పంటలను ధ్వంసం చేస్తాయో తెలియక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దాదాపు మూడు బృందాలుగా ఉన్న ఈ ఏనుగుల గుంపులో ఒంటరి ఏనుగుతో పాటు మొత్తం 21 ఏనుగులు సంచరిస్తుండటంతో సమీప గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గజరాజులు గ్రామాల్లోకి ప్రవేశించకుండా బాణసంచా పేలుస్తూ అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ప్రతాప్, సిబ్బంది వాటిని దారి మళ్లిస్తున్నారు. రాచూరు, పత్రపల్లి, పెరగాండ్లపల్లి సమీప గ్రామ ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

# ఆ పోలీసు దొంగలు ఎవరో తేల్చండి ?

- 'సాక్షి' కథనంపై విచారణకు ఆదేశించిన ఎస్పీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో ఓ ఇంట్లో చోరీ చేసిన దొంగ నుంచి భారీ మొత్తంలో లంచం తీసుకున్న పోలీసులు ఎవరో నిగ్గు తేల్చాలని ఎస్పీ మణికంఠ విచారణకు ఆదేశించారు. చిత్తూరులోని ఓ పోలీసు అధికారి, ముగ్గురు కానిస్టేబుళ్లు కలిసి.. నగరంలో చోరీకి పాల్పడ్డ దొంగ నుంచి రూ.12.50 లక్షలు లంచంగా తీసుకున్నారనే ఆరోపణలపై 'సాక్షి'లో ఆదివారం 'పోలీసు దొంగలు' శీర్షికన కథనం ప్రచురితమయింది. దీనిపై ఉదయం టెలీకాన్ఫరెన్సులో అధికారులతో మాట్లాడిన ఎస్పీ 'కొందరికి పోలీసులకు ఉద్యోగమంటే బాధ్యత లేకుండా పోయింది. ఏం జరుగుతుందో అంతా తెలుస్తూనే ఉంది. ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తే మంచిది..' అంటూ ఆ అవినీతి అధికారిని పరోక్షంగా హెచ్చరించినట్లు సమాచారం. రాయచోటి పోలీసులకు పట్టుబడ్డ ఓ దొంగ.. చిత్తూరులోని పోలీసు అధికారికి రూ.12.50 లక్షలు ఇచ్చానని చెప్పడం సంచలనంగా మారింది.

ఈ వ్యవహారంపై కొందరు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా విచారణ చేపట్టి, ఓ అధికారిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలున్నాయి. అయితే నిత్యం జిల్లా పోలీసు శాఖలోని ఓ 'బాస్' అండదండలు తనకుందంటూ ప్రచారం చేసుకునే అధికారిపైనే అవినీతి ఆరోపణలు రావడంతో ఎస్పీ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. డీఎస్పీ స్థాయి అధికారిని విచారణకు నియమించిన ఎస్పీ.. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. ఇదే సమయంలో ఆ అధికారి చిత్తూరు నుంచి ఇతర పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లడానికి ప్రయత్నాలు ప్రారంభించినట్లు పోలీసు శాఖలోని కొందరు అధికారులు గుసగుసలాడుతున్నారు.

### రేపటి నుంచి అన్నమయ్య సంకీర్తనోత్సవాలు


మాట్లాడుతున్న ట్రస్ట్ అధ్యక్షుడు మోహన్‌సుందరం

తిరుపతి కల్చరల్: శ్రీత్యాగరాజ స్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు ఐదు రోజుల పాటు త్యాగరాజ మండపంలో అన్నమయ్య సంకీర్తనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ సుందరం, కంచి రఘురాం తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 80 ఏళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఉత్సవాలను చేపడుతూ ప్రతిభావంతులైన ప్రముఖ విద్యాంసులచే త్యాగరాజ సంగీతోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తిరుమల శ్రీవారి పరమభక్తుడైన అన్నమయ్యకు క్రోధి నామ సంవత్సరం స్వామివారు సాక్షాత్కరించి ఆశీస్సులు అందించారన్నారు. ఆ పవిత్రమైన ఏడాదిని పురస్కరించుకుని ఐదు రోజుల పాటు అంటే ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 9.30 గంటల వరకు ప్రముఖ విద్యాంసులచే అన్నమయ్య సంకీర్తన కచేరీలు ఉంటాయని తెలిపారు.

# జల్లికట్టు జోరు..జన హోరు


దూసుకుపోతున్న కోడెగిత్తలు

వెదురుకుప్పం : కోడెగిత్తల జోరు.. యువత హుషారు ... దూసుకుపోతున్న ఎద్దును కట్టడి చేసే క్రమంలో యువత చూపిన ఉత్సాహం ఆ గ్రామంలో సందడి నెలకొంది. ఆదివారం మండలంలోని కొమరగుంటలో జరిగిన జల్లికట్టు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయిన ఎద్దు యువతను హోరెత్తించాయి. ఓ పక్క యువత కేరింతలు మరోపక్క ప్రజల అరుపులు, కేకలతో జల్లికట్టు దుమ్మురేపింది. ముందుగా వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ఎద్ల కొమ్ములకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, బెలూన్‌లు, పలకలు కట్టి బహుమతులతో సిద్ధం చేశారు. అప్పటికే యువత పెద్ద ఎత్తును గ్రామాలకు చేరుకుని బహుమతులు గెలుచుకునేందుకు అల్లి వద్ద నిలబడ్డారు. ఈక్రమంలో ఎద్లను ముస్తాబు చేసి విడతల వారీగా వందానికి ఉసిగొల్పారు. దీంతో కోడెగిత్తలు రంకెలేసుకుంటూ పరుగులు తీశాయి. దూసుకుపోయిన ఎద్దను నిలువరించి పలకలు పట్టేందుకు యువత ప్రయత్నం చేశారు. కొన్ని ఎద్ల వేగాన్ని నిలువరించిన యువకులు పలకలను లాక్కొని ఆనందంతో మురిసిపోయారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఈ ప్రాంగణం కిక్కిరిసింది.

### మూడు ఇసుక లారీలు సీజ్

గుడిపాల: ఆంధ్ర నుంచి తమిళనాడుకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఆదివారం నెల్లూరు నుంచి తమిళనాడుకు వెళ్తుండగా మండలంలోని పల్లూరు సమీపంలో పట్టుకున్నట్లు చెప్పారు. వాహన తనిఖీల్లో భాగంగా తమిళనాడుకు అక్రమంగా రికార్డులు లేక వెళ్తున్న మూడు లారీలను గుర్తించామన్నారు. వీటిని తనిఖీ చేయగా వాహనాల్లో ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి, వారిని అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలించినట్లయితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



### 42వ రోజుకు చేరిన జూడాల సమ్మె


సమ్మెలో పాల్గొన్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ: గౌరవవేతనం పెంచాలంటూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీ జూడాలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 42వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీ అధికారులు, ప్రభుత్వం తమ ఆవేదనను అర్థం చేసుకోకపోవడం దారుణమన్నారు. గౌరవేతనం పెంచేవరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు.



# యథేచ్ఛగా మట్టి దందా

- ఆనవాళ్లు కోల్పోతున్న చెరువులు
- కూటమి నాయకుల కనుసన్నల్లో మట్టి దోపిడీ
- కుప్పంలో అడ్డుపడేది ఎవరు.. అడిగేది ఎవరు?


లక్ష్మీపురం చెరువులో జేసీబీతో మట్టి తవ్వకాలు (ఫైల్)

కుప్పం రూరల్ : కుప్పం నియోజకవర్గంలోని చెరువుల్లో మట్టి దోపిడీ విచ్చలవిడిగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మట్టి దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. నిత్యం ఏదో ఒక చెరువులో మట్టి తొలగిస్తూనే ఉన్నారు. రాత్రీ,పగలు తేడా లేకుండా మట్టి దోపిడీ చేస్తూ రూ.లక్షల్లో వెనుకేసుకుంటున్నారు. ఈ మొత్తం తతంగం కూటమి నేతల కనుసన్నల్లోనే సాగుతుండడంతో చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారు. దీంతో అక్రమార్కుల ఆగడాలకు అంతే లేకుండా పోతోంది.

**పరిస్థితి ఇలా..**

కుప్పం నియోజకవర్గంలో 500కు పైగా చెరువులను ప్రజల తాగునీరు, సాగునీటి అవసరాల కోసం అప్పట్లో నిర్మాణాలు చేపట్టారు. ఒక కుప్పం మండలంలోనే 145 చెరువులు ఉన్నాయి. ఇందులో వంద ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న చెరువులు 8, వందకు లోపు ఆయకట్టు ఉన్న చెరువులు 137 ఉన్నాయి. వీటిలో నిత్యం ఏదో ఒక చోట మట్టి దోపిడీ జరుగుతూనే ఉంది. ముఖ్యంగా కుప్పం పట్టణానికి ఆనుకున్న ఉన్న లక్ష్మీపురం, వీరప్పనాయునిచెరువు, దామలచెరువు, కుప్పం చెరువు, పెద్దబంగారునత్తం చెరువుల్లో దోపిడీ ఎక్కువైంది. ఇక్కడ మట్టి దోచుకోవడం పరిపాటిగా మారింది. దీంతో 50 నుంచి 60 అడుగుల మేర గుంతలు ఏర్పడి చెరువులు కళా విహీనంగా మారింది. గుంతల్లో జేసీబీ, ట్రాక్టర్లు ఉన్నా కనిపించని విధంగా తయారైంది. ఇంత పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడడంతో వర్షాలు కురిసినా నీరు ఎక్కువ కాలం నిలువ ఉండదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెరువుల్లో పైభాగాన ఉండే మట్టి, ఇసుక తొలగిస్తే నీరు త్వరగా ఇంకిపోయి భూమి అడుగుల్లోకి వెళ్లిపోతుందని సూచిస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు**

నిత్యం చెరువుల్లో మట్టి దోపిడీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సామాన్యుడి చెరువులోకి వెళ్లి వచ్చినా ఆంక్షలు గుర్తుకు వచ్చే అధికారులకు భారీ యంత్రాలతో అడ్డ గోలుగా మట్టి తరలిపోతున్నా కనిపించడం లేదు. ముఖ్యంగా కుప్పం పట్టణానికి ఆనుకుని ఉన్న లక్ష్మీపురం, కుప్పం, వీరప్పనాయుని, పెద్దబంగారునత్తం చెరువుల్లో నిత్యం రాత్రీ, పగలు తేడా లేకుండా దోపిడీ జరుగుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యమంత్రి నియోజక వర్గంలో కావడం, దోపిడీ వెనుక కూటమి నేతల హస్తం ఉండడంతో ఏ వైపు నుంచి ఏ రకమైన ఒత్తిడి వస్తుందో అని అధికారులు వెనుకడుగు వేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజు కుప్పం వచ్చి వెళ్లే జిల్లా అధికారులు సైతం ఈ దోపిడీని అడ్డుకోలేకపోవడం దారుణమని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి దోపిడీకి అడ్డుకట్ట వేసి చెరువులను కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

**కూటమి నేతల కనుసన్నల్లోనే ..**

ఇది వరకు ఒక ఎత్తు... కూటమి ప్రభుత్వం రావడంతో మరో ఎత్తు అన్న విధంగా మట్టి దోపిడీ పరిస్థితి తయారైంది. కూటమి ప్రభు త్వం రావడంతో బియ్యం, ఇసుకతో పాటు మట్టి దోపిడీపై వారి కన్నుపడింది. అధినేత నియోజక వర్గం కావడంతో తమకు అడ్డు ఉండదని, చోటామోటా నాయకుల నుంచి మండల స్థాయి వరకు మట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. ఒక్కో ట్రాక్టర్ లోడు మట్టి రూ.400 వరకు పలుకుతుండడంతో అక్రమార్కులు నిత్యం లక్షల్లో దోచుకుంటున్నారు.

# వృక్ష సంపదపై అధ్యయనం


అధ్యయన యాత్రలో విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ వృక్ష శాస్త్ర విభాగం విద్యార్థులు మూడు రోజుల పశ్చిమ కనుమల వృక్ష సంపద, జీవ వైవిధ్యం అధ్యయన యాత్రకు శ్రీకారం చుట్టారు. అధ్యాపకులు నాగలక్ష్మి, దేవమ్మ, కామాక్షమ్మ, వేణు, అంకన్న పర్యవేక్షణలో, విద్యార్థులు రూపేష్, శివాని నేతృత్వంలో యాత్ర చేపట్టారు. ప్రధానంగా కేరళలోని హొగెనెకల్ జలపాతం, టీ ఫ్యాక్టరీ, బ్రిడ్ గార్డెన్, రోజ్ గార్డెన్, నేషనల్ బొటానికల్ గార్డెన్, ఊటీ కొండలు, అతిరేపల్లి వాటర్‌ఫాల్స్ వంటి ప్రదేశాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లోని వృక్షసంపదను అధ్యయనం చేశారు. అధ్యాపకులు మాట్లాడుతూ వైవిధ్యమైన మొక్క భాగాలను విద్యార్థులు సేకరించారని, వాటిని హెర్బేరియం షీట్‌ల ద్వారా నిల్వ చేయనున్నట్లు వెల్లడించారు. సోమవారం యాత్ర ముగించుకుని వర్సిటీకి చేరుకోనున్నట్లు తెలిపారు.